క్లుప్తంగా

ఎమ్మెల్యేకు సత్కారం



సత్కరిస్తున్న అర్చకులు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లిలో విశ్వబ్రాహ్మణ అర్చక పురోహిత సంఘం ఆధ్వర్యంలో అర్చకులు ఎమ్మెల్యే విజయరమణారావును శనివారం ఆశీర్వదించారు. పూర్ణకుంభంతో ఎమ్మెల్యేను స్వాగతించిన అర్చకులు గజమాలతో సత్కరించారు. నియోజకవర్గ అర్చక పురోహిత సంఘం అధ్యక్షుడు కందునూరి ఈశ్వరచార్యులు, కోటగిరి వేణుమాధవచారి, వీరచారి, సత్యనారాయణచార్యులు, స్వర్ణకార సంఘ రాష్ట్ర నాయకులు కందుకూరి ప్రకాశ్‌రావు ఉన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న సీఐ కృష్ణ

పెద్దపల్లిరూరల్: అందుబాటులోకి వచ్చిన సాంకేతిక పరిజ్ఞానంతో ఆన్‌లైన్ నేరాలు, సైబర్ మోసాలు ఎక్కువయ్యాయని, ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని పెద్దపల్లి సీఐ కృష్ణ హితవు పలికారు. పెద్దపల్లిలోని ట్రినిటీ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం విద్యార్థులకు సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండేందుకు అనుసరించాల్సిన పద్ధతుల గురించి అవగాహన కల్పించారు. విద్యార్థులు తమ భవిష్యత్‌ను ఉన్నతంగా ఉండేలా లక్ష్యాలను ఎంచుకుని, వాటిని సాధించి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. గంజాయి, డ్రగ్స్‌కు అలవాటు పడి భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దన్నారు. వేధింపులకు గురయ్యే విద్యార్థినులు నిర్భయంగా ఫిర్యాదు చేయాలన్నారు. ఆకతాయిల ఆట కట్టించేందుకు షీటీంలు అందుబాటులో ఉన్నాయని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎస్సై మల్లేశ్ తదితరులు ఉన్నారు.

ఉచిత వైద్యశిబిరాలు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లిలోని రైల్వేస్టేషన్ రోడ్డులో గల ఆంజనేయస్వామి ఆలయం వద్ద శనివారం శివకృష్ణ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. షుగర్, బీపీతో పాటు ఈసీజీ తదితర పరీక్షలను డాక్టర్ కంది మహేశ్వర్‌రెడ్డితో పాటు పలువురు వైద్యులు, సిబ్బంది నిర్వహించి అవసరమైన మందులు అందించారు. అలాగే పెద్దపల్లి మండలం హన్మంతునిపేటలో లయన్స్‌క్లబ్ ఆఫ్ పెద్దపల్లి ఎలైట్ ఆధ్వర్యంలో వైద్యులు దీప్తి ప్రసాద్, రాజశేఖర్ విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. క్లబ్ సభ్యులు సంపత్‌రావు, అశోక్‌కుమార్, భిక్షపతి, శ్రీనివాస్, హెచ్‌ఎం దశరథం ఉన్నారు.

5న పెద్దపల్లిలో బీఆర్‌ఎస్ సమావేశం

ఓదెల: పెద్దపల్లి రెడ్డి ఫంక్షన్‌హాల్‌లో ఈనెల 5న సోమవారం మధ్యాహ్నం ఒంటిగంటకు జరిగే బీఆర్‌ఎస్ నియోజకవర్గ విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశానికి ఓదెల నుంచి అధిక సంఖ్యలో తరలిరావాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఐరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. అధిక సంఖ్యలో ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి విజయవంతం చేయాలని ఆయన కోరారు.

సమ్మె పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

పెద్దపల్లిరూరల్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన కార్మిక చట్టాలతో కార్మికులకు అదనంగా నాలుగు గంటల పనిభారం పెరుగుతుందని, అందుకు నిరసనగానే 16న సమ్మె తలపెట్టినట్టు సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముత్యంరావు అన్నారు. పెద్దపల్లిలో శనివారం నాయకులతో కలిసి సమ్మె పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్మికులను యజమానులకు బానిసలుగా మార్చే చట్టాలను రద్దుపర్చాలని డిమాండ్ చేశారు. నాయకులు జ్యోతి, అంజయ్య, వేణుగోపాల్, వెంకటస్వామి, ఖాజా, ప్రవీణ్, కిషోర్, రషీద్, నరేశ్, లక్ష్మణ్, రమేశ్ పాల్గొన్నారు.

సాంస్కృతిక కళా వైభవాన్ని చాటుదాం

మంథని: నియోజకవర్గంలో సాంస్కృతిక కళా వైభవాన్ని చాటుదామని విద్యార్థి యువత వ్యవస్థాపకుడు కొండేల మారుతి పిలుపునిచ్చారు. శనివారం విద్యార్థి యువత కార్యాలయంలో గౌతమి కళా రవళి కళాకారుల సభ్యత్వ సేకరణ ప్రారంభించారు. ఘంటసాల జయంతి సందర్భంగా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమ సమన్వయ కర్తలు సర్వే చినబాపు, మల్లోజు నరేందర్ పాల్గొన్నారు.

కంకర పోశారు.. తారు మరిచారు

- దుమ్ముతో వాహనదారుల ఇబ్బంది
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు



రోడ్డుపై వాహనాల రాకపోకలతో లేస్తున్న దుమ్ము

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం ఎఫ్‌సీఐ క్రాస్ రోడ్ నుంచి పర్మనెంట్ టౌన్‌షిప్ రింగ్‌రోడ్ వరకు రోడ్డు నిర్మాణం కోసం గతేడాది జనవరిలో పట్టణ ప్రగతి నిధుల నుంచి రూ.రెండు కోట్లు కేటాయించి రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. సంవత్సరం గడుస్తున్నప్పటికీ రోడ్డు పనులు ఇంకా పూర్తి కాలేదు. కొద్దిరోజుల క్రితం రోడ్డు పనులను ప్రారంభించిన సదరు కాంట్రాక్టర్ కంకర పోశారు. తారు వేయడం జాప్యం చేయడంతో వాహనాల రాకపోకలతో రోడ్డుపై విపరీతంగా దుమ్ము వచ్చి ఇబ్బందులకు గురవుతున్నారు. ఇటీవల రోడ్డుపై దుమ్ము వస్తున్న విషయాన్ని స్థానిక కార్పొరేటర్ కొలిపాక సుజాత సదరు కాంట్రాక్టర్‌కు, మున్సిపల్ అధికారులకు తెలియజేశారు. తూతూ మంత్రంగా నీటి చల్లింపు చేపట్టి మళ్లీ నీరు చల్లడం మరిచారు. దీంతో వాహనదారులు, పాదచారులు కళ్లలో దుమ్ము పడుతోందని వాపోతున్నారు.

లీడర్లు నిబద్ధతతో పనిచేయాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయరమణారావు

సుల్తానాబాద్‌రూరల్: లీడర్లు నిబద్ధతతో ఉన్నప్పుడే అభివృద్ధి మానేరు వాగు నుంచి ఇసుక తరలిస్తున్న లారీలను అడ్డుకోవచ్చని ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. సుల్తానాబాద్ మండలం కదంబాపూర్ గ్రామంలో తొమ్మిది కుల సంఘాల కమ్యూనిటీ హాల్స్, గ్రంథాలయ నూతన భవనాలను శనివారం ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మానేరు వాగు నుంచి ఇసుక తరలిపోకుండా ఉండేందుకు ముందుగా రైతులు పంట పొలాలను లీజుకు ఇవ్వొద్దని సూచించారు. ధాన్యం అమ్మకంలో కటింగ్ పేరుతో రైతులను మోసం చేస్తే ఊరుకునేది లేదని, అలాంటివి జరిగితే సహించేది లేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు కొడెం సురేఖ, కొడెం అజయ్, సింగిల్‌విండో చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్, నాయకులు ప్రకాశ్‌రావు, దామోదర్, సతీశ్ ఉన్నారు.

క్యాన్సర్‌పై అందరికీ అవగాహన ఉండాలి



కరపత్రం విడుదల చేస్తున్న వైద్యులు



మాట్లాడుతున్న హెల్త్ ఆఫీసర్

కోల్‌సిటీ: క్యాన్సర్‌పై అందరూ అవగాహన కలిగి ఉండాలని రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ సతీమణి మనాలి రాజ్‌ఠాకూర్, జెడ్పీటీసీ కందుల సంధ్యారాణి, మగువ లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు డాక్టర్ టి.లక్ష్మీవాణి కోరారు. వరల్డ్ క్యాన్సర్ డే సందర్భంగా శనివారం గోదావరిఖని కల్యాణ్‌నగర్‌లోని లక్ష్మీవాణి ఆస్పత్రిలో క్యాన్సర్‌పై మగువ లయన్స్ క్లబ్ అవగాహన సదస్సు నిర్వహించింది. ఈ సందర్భంగా క్యాన్సర్‌పై అవగాహన కల్పించే కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ క్యాన్సర్ పేషెంట్లు ఒత్తిడికి లోనుకాకుండా అవగాహనతో వ్యాధిని జయించాలని, క్రమం తప్పని వైద్యపరీక్షలతో క్యాన్సర్‌ను దూరం చేయవచ్చని అవగాహన కల్పించారు. అనంతరం డాక్టర్ లక్ష్మీవాణి మహిళలకు ఉచితంగా స్క్రీనింగ్ టెస్టులు నిర్వహించారు. తక్కువ ఖర్చులో మహిళలకు క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్టులు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మగువ కార్యదర్శి గాలి సునీత, లయన్స్ క్లబ్ ప్రతినిధులు గంగాధర్, తిలక్ చక్రవర్తి, కంకణాల ముకుందరెడ్డి, తానిపర్తి విజయలక్ష్మి, బాలసాని పద్మ, బంక కళావతి, మనీషా, కవిత, శ్రీలత, చింతిరెడ్డి సంతోషారెడ్డి, సీహెచ్.లింగమూర్తి, బీనా సింగ్, సుష్మారెడ్డి ఉన్నారు.

జీడీకే–11వ గనిపై..

గోదావరిఖని: క్యాన్సర్‌పై అవగాహన సదస్సు శనివారం జీడీకే–11గనిపై నిర్వహించారు. సింగరేణి హెల్త్ ఆఫీసర్ సుమన్ పాల్గొని ఉద్యోగులకు కాన్సర్ వ్యాధి, దాని లక్షణాలపై అవగాహన కల్పించారు. దీర్ఘకాలంగా నయంకాని పుండ్లు, గడ్డలు వాపు, పరిమాణం పెరగడం, అధిక రక్తస్రావం ఉంటే డాక్టర్లను సంప్రదించి వైద్యం పొందాలని సూచించారు. పొగతాగడం మానుకోవాలని, నిత్యం వ్యాయామం చేయాలని, గుట్కాలు తినడం, మద్యం సేవించడం మానుకోవాలన్నారు.

పెద్దపల్లి ఎంపీ అభ్యర్థిగా అవకాశం ఇవ్వాలి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న శంకర్

గోదావరిఖని: పెద్దపల్లి ఎంపీ అభ్యర్థిగా తనకు అవకాశం కల్పించాలని రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాగూర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. శనివారం పార్టీ అభ్యర్థిగా కొప్పుల శంకర్ ఎమ్మెల్యేను కలిసి కోరారు. ఆయన వెంట టీపీసీసీ కార్యదర్శి కాల్వ లింగస్వామి, మాజీ వైస్ చైర్మన్ రాయమల్లుగౌడ్, నాయకులు నాయిని ఓదెలు, గుంపుల తిరుపతి, బొమ్మక శైలజ, శ్రీనివాస్ ఉన్నారు.

కార్మికులకు సన్మానం



సన్మానిస్తున్న మనోహర్‌రెడ్డి, అధికారులు

పాలకుర్తి: బసంత్‌నగర్ కేశోరాం సిమెంట్ కర్మాగారంలో సుదీర్ఘకాలం పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన కార్మికులను శనివారం గుర్తింపు కార్మికసంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. పాలకుర్తి గ్రామానికి చెందిన లక్కం రాజయ్య, జీడీనగర్‌కు చెందిన బొంకూరి చంద్రయ్యను కంపెనీ హెచ్‌ఆర్ మేనేజర్ గోవిందరావు కార్యాలయంలో సత్కరించి జ్ఞాపికను బహూకరించారు. పర్మినెంట్ కార్మిక సంఘం అధ్యక్షుడు బయ్యపు మనోహర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి దాడి మహేశ్, వర్కింగ్ ప్రెసిడెంట్ పర్శవేని శ్రీనివాస్, కంపెనీ అధికారులు రాజేందర్, గౌస్‌పాషా, కార్మికులు పోతుల ప్రసాద్, గుంపుల శంకర్, విశ్వనాథం, నగునూరి రమేశ్, శ్రీనివాస్, ఏదునూరి నారాయణ పాల్గొన్నారు.

పాఠశాలల్లో ఘనంగా ఫుడ్ ఫెస్టివల్ డే



వంటలు ప్రదర్శిస్తున్న పిల్లలు



క్రిసెంట్ పాఠశాలలో..

గోదావరిఖనిటౌన్: స్థానిక కృష్ణవేణి పాఠశాలలో శనివారం ఫుడ్ ఫెస్టివల్ డే, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ మంజుల శ్రీనివాస్‌రెడ్డి పిల్లలకు న్యూట్రిషన్ ఫుడ్‌తో కలిగే లాభాలు, ఫ్రిజ్జుల్లో నిల్వ ఉంచిన ఫుడ్‌తో కలిగే అనారోగ్య సమస్యల గురించి వివరించారు. ఈ సందర్భంగా పిల్లలు ప్రదర్శించిన పలు రకాల ఆహార పదార్థాలు, పిల్లలు తయారు చేసిన పలు రకాల వస్తువులు అందరినీ ఆకర్షించాయి.

క్రిసెంట్ పాఠశాలలో..

కాల్వశ్రీరాంపూర్: కాల్వశ్రీరాంపూర్ క్రిసెంట్ పాఠశాలలో శనివారం విద్యార్థులు ఫుడ్ ఫెస్టివెల్ కార్యక్రమం నిర్వహించారు. తెలుగు ప్రజల పండుగలు, తయారుచేసే వంటకాలు, నిత్యం తీసుకునే ఆరోగ్యకరమైన ఆహారం విద్యార్థులు స్వయంగా తయారు చేసి ఆహుతులకు విక్రయించారు. అంబలి, గడుక, రాగిసంకటి, రోటిమితాయి (రోట్లో నూరిన)కారం పచ్చడి, సాండెలు, పులిహోర, లడ్డూలు, జంతికలతోపాటు పాలక్‌రైస్, టమాట రైస్, పుదీనరైస్, గొంగూర పచ్చడి వంటి వంటలు, వివిధ రకాల స్వీట్లు విద్యార్థులు ప్రదర్శించారు. మాజీ సర్పంచులు సంగీత, సుజాత, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీనివాస్, ఏఎంసీ వైస్ చైర్మన్ కామిడి సంధ్య, నాయకులు ఆరెల్లి రమేశ్, వెంకట్‌రెడ్డి, హెచ్‌ఎం నసీర్, కరస్పాండెంట్ ఆయాజ్, నాయకులు మాదాసు సతీశ్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అక్రమంగా ఇసుక, మట్టి తరలిస్తే చర్యలు

కాల్వశ్రీరాంపూర్: అనుమతి లేకుండా ఇసుక, మట్టి తరలిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ జాహెద్ పాషా పేర్కొన్నారు. శనివారం తహసీల్దార్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని మీర్జంపేట, మొట్లపల్లి, రాతుపల్లి, కిష్టంపేటలోని మానేరు నది నుంచి, గంగారం, మంగపేట, కూనారం, పెగడపల్లి, మడిపెల్లి, శ్రీరాంపూర్‌లోని హుస్సేన్‌మియా వాగు నుంచి నిత్యం ఇసుక ట్రాక్టర్ల ద్వారా ఎలాంటి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్నట్లు ఫోన్ ద్వారా ఫిర్యాదులు వస్తున్నాయని పేర్కొన్నారు. పాండవులగుట్ట నుంచి, బొల్లగుట్ట నుంచి, ప్రభుత్వ భూముల నుంచి మట్టి అక్రమంగా తరలించే వాహనాలను సీజ్ చేస్తామని తెలిపారు. మైనింగ్ అధికారుల నుంచి పర్మిషన్ ఉంటేనే అనుమతి ఇస్తామని తహసీల్దార్ స్పష్టం చేశారు

ఖమ్మంపల్లిలో కళాకారుల ప్రదర్శన

ముత్తారం: మండలంలోని ఖమ్మంపల్లిలో శనివారం సాంస్కృతిక కళాకారుల బృందం డ్రగ్స్, గంజాయి, మాదక ద్రవ్యాలు, పరిసరాల పరిశుభ్రత, ప్రభుత్వ పథకాలపై స్థానికులకు తమ ప్రదర్శనలతో అవగాహన కల్పించారు. కళాకారులు జనగామ రాజనర్సు, ఈదునూరి పద్మ, కొంద్ర వెంకటేశ్వర్లు, ఇల్లందుల మల్లేశ్, జిన్న రమ, సతేంద్ర రాజన్న, దీకొండ శ్రావణ్, కన్నూరి రేణుక, కట్కూరి శ్రీవల్లి పాల్గొన్నారు.

జూలపల్లి: గ్రామాల్లో పారిశుద్ధ్యం, పరిశుభ్రత, మాదక ద్రవ్యాల నిరోధం, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై సాంస్కృతిక సారథి కళాకారులతో ప్రదర్శన నిర్వహించారు. జిల్లా పౌరసంబంధాల శాఖ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన కళా ప్రదర్శనలో కళాకారులు స్నేహలత, దయానర్సింగ్, బుర్ర శంకర్‌గౌడ్, సరిత, స్పందన, స్వప్న, వెంకటస్వామి పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

✦ కుష్ఠురహిత పట్టణంగా మారుద్దాం

సుల్తానాబాద్: కుష్ఠురహిత పట్టణంగా తీర్చిదిద్దేందుకు ప్రజలు, అధికారులు, ప్రజాప్రతినిధులు సహకరించాలని పల్లె దవాఖాన డాక్టర్ శ్రీజ పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని జెడ్పీఎస్ఎస్ బాయ్స్ పాఠశాలలో కుష్ఠు నిర్మూలన, అవగాహన ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు.

✦ కమలపత్ర అవార్డుకు ఎంపికైన లింగమూర్తి

కోల్‌సిటీ: సదాశయ ఫౌండేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి సీహెచ్.లింగమూర్తి కమలపత్ర అవార్డుకు ఎంపికయ్యారు. సింగరేణి సంస్థలో ఉద్యోగం చేస్తున్న లింగమూర్తి 15ఏళ్లుగా నేత్ర, అవయవ, దేహదానాలతోపాటు అనేక సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. లింగమూర్తి సేవలను గుర్తించిన మంచిర్యాల జిల్లాలోని జూనియర్ ఛాంబర్ ఆఫ్ ఇంటర్నేషనల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రాజు సామాజిక సేవా విభాగంలో కమలపత్ర అవార్డుకు ఎంపిక చేసినట్లు తెలిపారు. ఆదివారం ఈ అవార్డును మంచిర్యాలలోని నస్పూర్‌లో నిర్వహించే ప్రత్యేక వేడుకల్లో ప్రధానం చేయనున్నట్లు పేర్కొన్నారు.

✦ ఆత్మవిశ్వాసంతో పరీక్షలకు సిద్ధం కావాలి

జూలపల్లి: విద్యార్థులు రానున్న పదో తరగతి పరీక్షలకు భయపడకుండా ఆత్మవిశ్వాసంతో రాయాలని ఎంపీడీవో వేణుగోపాలరావు సూచించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల, జెడ్పీహెచ్ఎస్ పాఠశాలల పదో తరగతి విద్యార్థులకు మోటివేటర్లతో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మోటివేటర్ నరేశ్ మాట్లాడుతూ పరీక్షలంటే భయం వీడాలని సూచించారు. ఎంపీవో కిరణ్, మోటివేటర్లు మంజుల, కృష్ణమూర్తి, హెచ్‌ఎం లక్ష్మణ్, వీరమల్లు పాల్గొన్నారు.

✦ ప్రశంస పత్రాలు అందజేత

యైటింక్లయిన్‌కాలనీ: జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం యైటింక్లయిన్ కాలనీలోని స్పందన మోడల్ స్కూల్ విద్యార్థులు జమాత్ ఇస్లామీ హింద్ గోదావరిఖని శాఖ ఆధ్వర్యంలో టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంస పత్రాలు అందజేశారు. 8వ తరగతి చదువుతున్న హర్షిని జిల్లాస్థాయిలో తృతీయ స్థానంలో గెలుపొందగా విద్యార్థులకు ప్రతిభ పత్రాలు అందజేశారు.

✦ అసత్య ఆరోపణలు మానుకోవాలి

రామగిరి: పెద్దపల్లి జెడ్పీచైర్మన్ పుట్ట మధు రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, కాంగ్రెస్‌పై అసత్య ఆరోపణలు మానుకోవాలని ఎంపీపీ ఆరెల్లి దేవక్క ఒక ప్రకటనలో అన్నారు. మంథనిలో హత్యా రాజకీయాలను ప్రోత్సహించేది పుట్ట మధు అని ప్రజలకు తెలుసని, మరలా ప్రాణభయం ఉందని నాటకాలు ఆడుతున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీ నాయకత్వాన్ని ప్రోత్సహిస్తూ తమకు అండగా ఉంటున్న మంత్రి శ్రీధర్‌బాబుపై ఇష్టారాజ్యంగా మాట్లాడితే సహించేది లేదన్నారు. ఇప్పటికైనా పుట్ట మధు అతని అనుచరులు పద్ధతి మార్చుకోవాలని హితువు పలికారు.

✦ జూలపల్లి మాజీ సర్పంచ్‌కు సన్మానం

జూలపల్లి: మండల కేంద్రంలోని ఎస్సీకాలనీ కమ్యూనిటీ భవనంలో మాజీ సర్పంచ్ ధారబోయిన నర్సింహయాదవ్, మాజీ వార్డు సభ్యుడు సంపత్‌ను దళిత సంఘాల నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో మానుమాండ్ల శ్రీనివాస్, సంపత్, రాకేశ్, దుర్గయ్య, నర్సయ్య పాల్గొన్నారు.


✦ ఓబీసీ సర్టిఫికెట్ ఇవ్వాలి

ఓదెల: ఆరె కులానికి ఓబీసీ సర్టిఫికెట్ ఇవ్వాలని కోరుతూ హైదరాబాద్‌లో జరిగిన సభకు ముఖ్య అతిథిగా వచ్చిన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి ఆరె సంఘం జిల్లా అధ్యక్షుడు సమ్మారావు, ఉపాధ్యక్షుడు గిరాం సాంబమూర్తి శనివారం వినతిపత్రం సమర్పించారు. ఓబీసీ సర్టిఫికెట్ లేనందున కేంద్ర ప్రభుత్వం ఆధీనంలోని ఉద్యోగాలకు విద్యార్థులు అనర్హులుగా ప్రకటిస్తున్నారని వారు తెలిపారు.

✦ తప్పుడు ఆరోపణ చేస్తే సహించేది లేదు

మంథని: తమ నాయకుడిపై తప్పుడు ఆరోపణ చేస్తే సహించేది లేదని డీసీసీ అధికార ప్రతినిధి, మంథని డివిజన్ మీడియా కన్వీనర్ ఇనుముల సతీశ్ అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మంథని ఎంపీపీ కొండా శంకర్, మున్సిపల్ కౌన్సిలర్లతో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. శుక్రవారం మంథనిలో జరిగిన బీఆర్‌ఎస్ కార్యకర్తల సమావేశంలో జెడ్పీచైర్మన్ పుట్ట మధు మాట్లాడినవన్నీ అబద్ధాలేనని వాటిని ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. రూ.కోట్లు ఖర్చు చేసి అసెంబ్లీ ఎన్నికల్లో శ్రీధర్‌బాబు విజయం సాధించారని పుట్ట మధు అనడం సరికాదని ఎంపీపీ కొండ శంకర్ అన్నారు. కౌన్సిలర్లు సీపతి బానయ్య, వీకే.రవి, చొప్పకట్ల హనుమంతరావు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



క్రీడాకారులతో ఎమ్మెల్యే సతీమణి మనాలిఠాకూర్

రామగుండం: మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను శనివారం అంతర్గాం మండల కేంద్రంలో ఏపీజే అబ్దుల్ కలాం ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించారు. రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్‌ఠాకూర్ సతీమణి మనాలి ఠాకూర్ పోటీలను ప్రారంభించారు. ప్రతీ గ్రామంలో క్రీడాపోటీలు నిర్వహిస్తే యువతలో పోటీతత్వం పెరుగుతుందన్నారు. అనంతరం గోలివాడ క్రీడాకారులకు బీఆర్‌ఎస్ అధ్యక్షుడు ధర్ని విష్ణు టీషర్ట్స్ అందజేశారు. కార్యక్రమంలో కలాం ట్రస్టు చైర్మన్ అంగోతు రవినాయక్, కెప్టెన్ గాదం కుమార్, మధు, చంద్రమోహన్, రమేశ్‌రెడ్డి, నర్సింహ, శివాజీ, వినయ్ సిద్దూ, ప్రణీత్, సాయి, కిరణ్, నిక్కీ, అరవింద ఉన్నారు.

అన్నిదానాల్లో అవయవదానం గొప్పది



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ లక్ష్మీవాణి

కోల్‌సిటీ: అన్నిదానాల్లో కంటి నేత్ర, అవయవదానం గొప్పదని మగువ లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు డాక్టర్ లక్ష్మీవాణి అన్నారు. గోదావరిఖని కళ్యాణ్‌నగర్‌లో శనివారం సాయంత్రం సదాశయ ఫౌండేషన్ ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో మహిళలకు అవయవదానంపై అవగాహన కల్పించారు. అమ్మ జన్మనిస్తే, అవయవదాతలు పునర్జన్మనిస్తున్నారని కొనియాడారు. మరణానంతరం మరో ఇద్దరు అంధులకు చూపును ప్రసాదించడానికి నేత్రదానం చేయడానికి ఇప్పుడే అందరూ ప్రతిజ్ఞ చేయాలని కోరారు. కార్యక్రమంలో సదాశయ ఫౌండేషన్ అధ్యక్షురాలు అన్నపూర్ణ, మగువ లయన్స్ క్లబ్ కోశాధికారి శశికళ, లయన్స్ క్లబ్ ప్రతినిధులు సంతోష పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికులకు వేతనాలు ఇప్పించండి



వినతిపత్రం ఇస్తున్న నాయకులు, కార్మికులు

పెద్దపల్లిరూరల్: జిల్లా ప్రభుత్వాసుపత్రి, మాతాశిశు కేంద్రంలో పనిచేస్తున్న కార్మికులకు 9నెలలుగా వేతనాలందక ఇబ్బందులు పడుతున్నారని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి జ్యోతి ఆరోపించారు. కార్మికులతో కలిసి ఆసుపత్రి వద్ద శనివారం ఆమె నిరసన వ్యక్తం చేశారు. అనంతరం వైద్యాధికారి ప్రణీత్‌కు వినతిపత్రం అందించారు. వేతనాలివ్వక కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తున్న కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకుని వెంటనే వేతనాలు ఇప్పించాలని కోరారు. నాయకులు వెంకటేశ్, లక్ష్మి, పద్మ, లావణ్య, జ్యోతి, స్వరూప, భూలక్ష్మి, సంపత్, చంద్రయ్య, సతీశ్, బబ్లూ ఉన్నారు.

వైద్యులకు సన్మానం



వైద్యులను సన్మానిస్తున్న జీఎం

యైటింక్లయిన్‌కాలనీ: జాతీయ మహిళా వైద్యుల దినోత్సవం సందర్భంగా సదాశయ ఫౌండేషన్, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో యైటింక్లయిన్‌కాలనీ సింగరేణి డిస్పెన్సరీలో విధులు నిర్వహిస్తున్న మహిళా వైద్యులకు శనివారం ఆర్జీ–2 ఏరియా ఎస్‌వోటూ జీఎం బచ్చా రవీందర్ చేతుల మీదుగా ఘనంగా సన్మానించారు. డిస్పెన్సరీలో విధులు నిర్వహిస్తున్న వైద్యులు డాక్టర్ గౌతమి, సాహితిని ఎస్‌వోటూ జీఎం కొనియాడారు. ఫౌండేషన్ ప్రతినిధులు రమేశ్, రాజిరెడ్డి, క్లబ్‌సభ్యులు పాల్గొన్నారు.

కార్మికులు సంఘం బలోపేతానికి సహకరించాలి



సంబరాల్లో కార్మికులు

రామగిరి: ప్రతి ఒక్క భవన నిర్మాణ కార్మికుడు సంఘం బలోపేతానికి సహకరించాలని జిల్లా అధ్యక్షుడు చిలువేరి స్వామి అన్నారు. శనివారం భవన నిర్మాణ కార్మిక సంఘం ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించుకున్నారు. కార్మికుల సమస్యలు తెలుసుకొని పరిష్కరించడమే ధ్యేయంగా పనిచేస్తామని, తనను ప్రోత్సహించి ముందుకు నడిపిస్తున్న కార్మికులకు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా ఉపాధ్యక్షుడు తిరున హరి రాజు, జనరల్ సెక్రటరీ బైరి శంకర్, కోశాధికారి ఎస్‌కే.షరీఫ్, సెక్రటరీ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్, బైక్ ఢీ

- ఇద్దరికి తీవ్రగాయాలు



బైక్‌ను ఢీకొన్న ఇసుక ట్రాక్టర్

ఎలిగేడు: మండలంలోని సుల్తాన్‌పూర్ గ్రామంలోని ఎస్సీకాలనీ వద్ద శనివారం బైక్‌ను ఇసుక ట్రాక్టర్ ఢీకొనడంతో బైక్‌పై వస్తున్న ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల వివరాల ప్రకారం ఎలిగేడు మండలం ధూళికట్ట గ్రామానికి చెందిన కసువోజ్జల రామ్మూర్తి అతని కుమారుడు సుబ్రమణ్యం బైక్‌పై ధూళికట్ట నుంచి ఎలిగేడు, సుల్తాన్‌పూర్ మీదుగా కరీంగర్ వెళ్తున్నారు. ఈక్రమంలో సుల్తాన్‌పూర్ ఎస్సీ కాలనీ వద్ద గర్రెపల్లి నుంచి ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ బైక్‌ను ఢీ కొనడంతో రామ్మూర్తి, సుబ్రమణ్యం బైక్‌పై నుంచి పడి తీవ్ర గాయాలయ్యాయి. కాగా ట్రాక్టర్ అదుపుతప్పి కాలనీలో ఓ ఇంటి ప్రహరీని ఢీకొట్టి లోపలికి చొచ్చుకెళ్లింది. ట్రాక్టర్ ఇంజన్ కింద డ్రైనేజీలో పడి బైక్ నుజ్జునుజ్జయింది. రామ్మూర్తి, సుబ్రమణ్యంను చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు. జూలపల్లి, సుల్తానాబాద్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. నూతనంగా డబుల్‌రోడ్డు నిర్మాణం కావడంతో ఇసుక ట్రాక్టర్లు అతివేగంగా నడుపుతుండడంతో తీవ్ర భయాందోళనకు గురవుతున్నామని కాలనీవాసులు, గ్రామస్తులు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. అంతేకాకుండా గుట్టల మట్టిని టిప్పర్ల ద్వారా గ్రామం మీదుగా నడుస్తున్నాయని, వాటిని నిలిపివేసేందుకు చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు.

మహిళలు స్వయం ఉపాధి పొందాలి

జూలపల్లి: కుట్టు శిక్షణ విజయవంతంగా పూర్తి చేసుకున్న మహిళలు స్వయం ఉపాధి కల్పించుకోవడంలో ముందుండాలని ఎంపీపీ రమాదేవి సూచించారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీలో పనిచేసిన మహిళా కూలీలకు ఎస్‌బీఐ, ఆర్‌సెటి ఆధ్వర్యంలో జ్యూట్ బ్యాగుల తయారీ, మార్కెటింగ్‌పై ఇచ్చిన కుట్టు శిక్షణ పూర్తి చేసుకున్న 27 మంది మహిళలకు ఎంపీడీవో కార్యాయలంలో ధృవీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో వేణుగోపాలరావు, ఏపీవో సదానందం తదితరులు ఉన్నారు.

ఇంటర్నేషనల్ వాసవీక్లబ్ అధ్యక్షుడిగా వంశీ

ధర్మారం: ఇంటర్నేషనల్ వాసవీక్లబ్ ధర్మారం అధ్యక్షుడిగా తాటిపెల్లి వంశీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శనివారం ధర్మారంలో ఏర్పాటు చేసిన వాసవీ క్లబ్ సర్వసభ్య సమావేశానికి వాసవీక్లబ్ ఇంటర్నేషనల్ వైస్ చైర్మన్ గోల్డెన్ స్టార్ సిరిపురం సత్యనారాయణ హాజరయ్యారు. ప్రధాన కార్యదర్శిగా మల్యాల శివ, కోశాధికారిగా ఈగం ప్రసాద్‌ను ఎన్నుకున్నారు. వాసవీక్లబ్ జిల్లా కమిటీ సభ్యుడు బీరెల్లి రామ్మోహన్, మాజీ జాయింట్ కార్యదర్శి ఎలగందుల అశోక్, కొల్లూరి కిశోర్ తదితరులు పాల్గొన్నారు.